# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

శుక్రవారం 20 జూన్ 2025 పేజీలు 8


## ఎవరి ఆదేశాలతో ఫోన్
# ట్యాపింగ్ చేశారు?
### ప్రభాకర్ రావును సుదీర్ఘంగా ప్రశ్నించిన సిట్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు నాలుగోసారి విచారణ
- జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో సుమారు 8 గంటల పాటు ప్రశ్నలు
- మహేశ్ కుమార్ గౌడ్, జైపాల్ రెడ్డి వాంగ్మూలాల ఆధారంగా విచారణ
- ప్రణీత్ రావు ఇచ్చిన సమాచారంతో ప్రభాకర్ రావును ప్రశ్నించిన సిట్
- 618 ఫోన్ల ట్యాపింగ్‌పై లోతుగా దర్యాప్తు చేస్తున్న అధికారులు
- ఎవరి ఆదేశాలతో ట్యాపింగ్ జరిగిందనే కోణంలో విచారణ



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ అధిపతి ప్రభాకర్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు గురువారం నాలుగోసారి విచారించారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఈ విచారణ దాదాపు 8 గంటల పాటు సాగినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు బాధితుల నుంచి సిట్ అధికారులు వాంగ్మూలాలు నమోదు చేసుకున్నారు. ముఖ్యంగా, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్

-2 లో

# రాజీలేని పోరాటం చేస్తాం

- పద్మశ్రీతో తన బాధ్యత పెరిగిందన్న మంద కృష్ణ
- దివ్యాంగులకు అండగా ఉంటానని వెల్లడి
- అణగారిన వర్గాల ప్రయోజనాలకు కట్టుబడి ఉంటానన్న మంద కృష్ణ

**హైదరాబాద్ పెన్ పవర్:** దివ్యాంగులకు రాజకీయ హక్కులు, తగిన ప్రాతినిధ్యం లభించేంత వరకు తాను ఆత్మబంధువుగా అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాలలో దివ్యాంగుల హక్కుల సాధన కోసం ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్‌లు శక్తివంతమైన ఉద్యమాలను నిర్మించి, ఘనమైన చరిత్రను సృష్టించాయని ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్ నాగోల్‌లో ఈరోజు ఏర్పాటు చేసిన సన్మాన సభలో మంద కృష్ణ మాదిగ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనకు లభించిన పద్మశ్రీ పురస్కారంతో సమాజం పట్ల తన బాధ్యతలు మరింతగా పెరిగాయని అన్నారు.

-2 లో



# ఆ ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి వైదొలుగుతా



**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం విషయంలో తనపై బురదచల్లడం సరికాదని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. చేస్తున్న ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి వైదొలుగుతానని చెప్పారు. "కాళేశ్వరం అంశంలో నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. కమిషన్ విచారణ త్వరగా ముగుస్తుందన్న నమ్మకం లేదు. దీనిపై సీబీఐ విచారణ జరగాలి. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి ప్రజలకు నీళ్లివ్వాలి. ఆ ప్రాజెక్టు కేసీఆర్ నిర్మించింది కాదు.. ప్రాణహిత-చేవెళ్ల రీడిజైన్ చేసి కాళేశ్వరం కట్టారు. అన్ని సమీక్షల తర్వాతే దానిపై కొలిక్కి వచ్చాం" అని ఈటల తెలిపారు.

# మహిళా సంఘాలకు 381 డ్రోన్లు పంపిణీ చేస్తాం


**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వ పథకం నమో డ్రోన్ దీదీ కింద సరఫరా అయ్యే 381 డ్రోన్లను మహిళాసంఘాలకు అందిస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సచివాలయంలో ఆయన తమ శాఖపై సమీక్ష నిర్వహించారు. "రాష్ట్రంలో జులై వరకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయి. ఆగస్టు మాసానికి అవసరమైన ఎరువులను తెప్పించాలి. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎన్నడూ లేని విధంగా ఈ సారి 1,55,257 టన్నుల జొన్నలను మార్క్‌ఫెడ్ ద్వారా కొన్నాం. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు నిర్దేశించే వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున నివేదిక ఇస్తాం" అని చెప్పారు.

**నెదర్లాండ్స్ కంపెనీ ప్రతినిధులతో భేటీ**

వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ వినియోగానికి సహకరిస్తామని నెదర్లాండ్స్‌కు చెందిన ఏఆర్ఐక్యూటీ సంస్థ ముందుకొచ్చింది. సంస్థ ప్రతినిధులు గాల్లి వినయ్, నడింపల్లి అనిరుధ్‌లు మంత్రి తుమ్మలను సచివాలయంలో కలిసి వ్యవసాయంలో ఏఐ వినియోగ ప్రాజెక్టు గురించి వివరించారు. ప్రతిపాదనలు ఇవ్వాలని మంత్రి వారికి సూచించారు.



## 12 మంది మావోయిస్టుల
# లొంగుబాటు
### లొంగిపోయినవారి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు




**హైదరాబాద్ పెన్ పవర్:** నిషేధిత మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పని చేస్తున్న నాయకులు, సభ్యులు మొత్తం 12 మంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట గురువారం లొంగిపోయారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ బి.రోహిత్‌రాజు వివరాలు వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డివిజనల్

-2 లో

## 12 మంది మావోయిస్టుల లొంగుబాటు

- మొదటి పేజీ తరువాయి

కమిటీ సభ్యులు ఇద్దరు, ఏరియా కమిటీ సభ్యులు నలుగురు, పార్టీ సభ్యులు ఇద్దరు, మిలీషియా సభ్యులు ఇద్దరు, ఆర్‌పీసీ సభ్యులు ఇద్దరున్నారని తెలిపారు. లొంగి పోయిన మావోయిస్టులకు తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ. 25వేల చొప్పున మొత్తం రూ. 3 లక్షలు అందజేశామన్నారు. క్యాడర్ల వారీగా రివార్డు నగదును వారి ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాలను తీసుకుని మొత్తం రూ. 26 లక్షలను చెక్కుల రూపంలో అందించనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

## బనకచర్లపై తెలంగాణ తీవ్ర అభ్యంతరాలు... ఏపీ సీఎం చంద్రబాబు ఏమన్నారంటే...!

- బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- తెలంగాణ ఆరోపణలపై స్పందించిన ముఖ్యమంత్రి
- పోలవరం తప్ప మరే ప్రాజెక్టుకు అనుమతి లేదని స్పష్టీకరణ
- కేవలం వరద జలాలనే వినియోగిస్తామని వెల్లడి
- ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ ప్రభుత్వం
- కేంద్రానికి ఫిర్యాదు చేసేందుకు తెలంగాణ సన్నాహాలు

హైదరాబాద్ పెన్ పవర్: బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదం మరింత ముదురుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుండడం తెలిసిందే. గోదావరి నదీ జలాలను బనకచర్ల ప్రాజెక్టుకు అనుసంధానించడం ద్వారా తమ రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అయితే, బనకచర్ల ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు నష్టం జరుగుతుందన్న ఆరోపణలపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. వాస్తవాలను ఆయన మీడియాకు వివరించారు. బనకచర్ల వద్ద పోలవరం మినహా మరే ఇతర ప్రాజెక్టుకు అనుమతులు లేవని ఆయన తేల్చిచెప్పారు. గురువారం అమరావతిలో మీడియాతో మాట్లాడిన చంద్రబాబు, బనకచర్ల ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారు. "బనకచర్ల ప్రాజెక్ట్ గురించి నేను చాలాసార్లు చెప్పాను. పోలవరం మినహా అక్కడ మరే ప్రాజెక్టుకు అనుమతి లేదు" అని ఆయన అన్నారు. గోదావరి జలాలను వేరే బేసిన్‌కు తరలిస్తున్నామని, గోదావరి జలాలతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినప్పుడు తాను ఎలాంటి అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు. "రెండు రాష్ట్రాల్లో ఉన్నది తెలుగువాళ్లే. నేను తెలంగాణ ప్రజలతో ఎప్పుడూ ఘర్షణ పడలేదు. అనవసర గొడవలతో ప్రజలను మభ్యపెట్టడం సరికాదు" అని చంద్రబాబు పేర్కొన్నారు. తాను హైదరాబాద్ నగరాన్ని ఆంధ్రప్రదేశ్ కోసమే అభివృద్ధి చేశానని, ఇప్పుడు హైదరాబాద్ కావాలని తాను ఎలా అడుగుతానని ప్రశ్నించారు. అంతేకాకుండా, అభివృద్ధి విషయంలో తన వైఖరిని చంద్రబాబు స్పష్టం చేశారు. "మీరు చేపట్టే ప్రాజెక్టులన్నీ పూర్తిచేయండి, పోరాటాలు తర్వాత చూసుకోవచ్చు. మేం హామీ ఇచ్చింది డబుల్ ఇంజన్ సర్కార్. దాని అర్థం ఏమిటో తెలుసుకోండి. అందరూ కలిసి రాష్ట్రాలను పోటీపడి అభివృద్ధి చేయాలన్నదే నా ఆకాంక్ష. తెలుగు జాతిని ప్రథమ స్థానంలో నిలపడం మనందరి బాధ్యత. అందుకోసం మనమంతా కలిసి పనిచేద్దాం. నేను ఎవరితోనూ గొడవలకు దిగను, కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కచ్చితంగా పోరాడతాను. బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం వాటిల్లదు. కేవలం వరద జలాలను మాత్రమే వినియోగిస్తామని స్పష్టంగా చెప్పాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

# ఎవరి ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్ చేశారు?

- మొదటి పేజీ తరువాయి

కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ అధికార ప్రతినిధి జైపాల్ రెడ్డి సహా మరికొందరు రాజకీయ నాయకులు ఇచ్చిన వాంగ్మూలాలను ఆధారంగా చేసుకుని ప్రభాకర్ రావును పశ్చిమ మండల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) విజయ్ కుమార్ నేతృత్వంలోని సిట్ బృందం లోతుగా ప్రశ్నించినట్లు సమాచారం. ప్రభాకర్ రావు బృందం సుమారు 618 మంది ఫోన్లను ట్యాప్ చేసినట్లు సిట్ ఇప్పటికే గుర్తించిన విషయం తెలిసిందే. బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగానే ప్రభాకర్ రావును ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ఇదే కేసులో నిన్న (బుధవారం) ప్రణీత్ రావును కూడా సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ప్రణీత్ రావు ఇచ్చిన వాంగ్మూలంలోని అంశాల ఆధారంగా కూడా ప్రభాకర్ రావును ప్రశ్నించినట్లు సమాచారం. ప్రణీత్ రావుకు ప్రభాకర్ రావు ఎలాంటి ఆదేశాలు ఇచ్చారు? ఎంతమంది ఫోన్లు ట్యాపింగ్ చేయాలని సూచించారు? అసలు ఎవరి ఆదేశాల మేరకు ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మొత్తం నడిచింది? అనే కీలక కోణాల్లో సిట్ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ విచారణ ద్వారా మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# రాజీలేని పోరాటం చేస్తాం

- మొదటి పేజీ తరువాయి

సమాజంలో అణచివేతకు గురవుతున్న వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు, వారి హక్కుల కోసం నిరంతరం పనిచేయడానికి ఈ అవార్డు తనకు మరింత స్ఫూర్తినిచ్చిందని ఆయన పేర్కొన్నారు. కులం, మతం వంటి భేదాలు చూడకుండా అన్ని వర్గాల ప్రజల మధ్య ఉండే నాయకుడిగా తాను కొనసాగుతానని మంద కృష్ణ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమానికి వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అధ్యక్షత వహించారు. సభలో జాతీయ కోర్ కమిటీ చైర్మన్ గోపాలరావు, వైస్ చైర్మన్ అందె రాంబాబు, వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, మహిళా అధ్యక్షురాలు సామినేని భవాని చౌదరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు అన్యం చిన్న సుబ్బయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు. దివ్యాంగుల హక్కుల సాధనలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ పోషించిన పాత్రను వక్తలు కొనియాడారు. భవిష్యత్తులో కూడా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో దివ్యాంగుల హక్కుల కోసం ఉద్యమాలు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువతి ఆత్మహత్య



హైదరాబాద్ పెన్ పవర్: పెళ్లయిన ఆరు నెలలకే ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తనువు చాలించింది. అదనపు కట్నం కోసం అత్తింటివారు పెట్టే వేధింపులు తాళలేక కేబుల్ వంతెన మీద నుంచి దుర్గం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మాదాపూర్ ఠాణా పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘనటకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈస్ట్‌మారేడ్‌పల్లిలోని అడ్డగుట్టకు చెందిన బి.సుష్మ (27)ను నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన గొల్లూరు అమృత్‌కు ఇచ్చి ఈ ఏడాది జనవరి 31న వివాహం చేశారు. సుష్మ హైటెక్‌సిటీ ప్రాంతంలోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. పెళ్లి సమయంలో రూ. 5 లక్షల నగదు, 6 తులాల బంగారం, ద్విచక్రవాహనం కట్నం కింద ఇచ్చారు. కానీ, పెళ్లి అయిన కొద్ది రోజుల నుంచే అదనపు కట్నం కావాలంటూ భర్తతోపాటు అత్త మామ, మరిది కలిసి సుష్మను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆరోగ్యం బాగలేకపోవడంతో ఈ నెల 18న సుష్మను ఆనంద్‌బాగ్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ నెల 16న ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సుష్మను తల్లిదండ్రులు పుట్టింటికి తీసుకెళ్లారు. మరుసటి రోజు(జూన్ 19న) ల్యాప్‌టాప్ తెచ్చుకునేందుకు సుష్మ తన తండ్రితో కలిసి అత్తింటికి వెళ్లింది. ఈ క్రమంలో మళ్లీ ఎందుకు వచ్చావంటూ భర్త, అత్తమామలు ప్రశ్నించి.. అదనపు కట్నం తీసుకురావాలంటూ దూషించారు. దీంతో సుష్మ తీవ్ర మనస్తాపానికి గురైంది. బుధవారం ఉద్యోగరీత్యా హైటెక్ సిటీలోని కంపెనీకి వెళ్లింది. కానీ రాత్రి ఒంటి గంట వరకు ఇంటికి తిరిగిరాకపోవడంతో తండ్రి అంజయ్య కంపెనీకి ఫోన్ చేశాడు. రాత్రి 8.30 గంటల సమయంలోనే ఆమె బయటకు వెళ్లిందని కంపెనీవారు తెలిపారు. దీంతో తెలిసిన చోట గాలించిన తల్లిదండ్రులు గురువారం తెల్లవారు జామున 4 గంటలకు మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం 7.30 గంటల సమయంలో దుర్గంచెరువులో ఓ మహిళ శవం తేలిందని స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా మృతదేహం సుష్మదిగా గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తతోపాటు అత్తమామలు, మరిదిపై 304బీ సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళతో మంత్రి రాసలీలలు.. ఫొటోలు లీక్.. రచ్చ

**హైదరాబాద్ పెన్ పవర్:**పంజాబ్ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపిన ఓ సంఘటన ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన మంత్రి రవ్‌జోత్ సింగ్ ఓ మహిళతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో లీకయ్యాయి. శిరోమణి అకాలీదళ్ నేత బిక్రమ్ సింగ్ ఈ ఫొటోలను ఎక్స్ ప్లాట్‌ఫామ్‌లో షేర్ చేయడంతో ఈ వివాదం రాజకీయ దుమారాన్ని రేపింది.



**మంత్రి పదవి నుంచి తొలగించాలంటూ డిమాండ్**

బిక్రమ్ సింగ్ ఈ ఫొటోలతో పాటు ఒక పోస్టు చేశారు. అందులో, “ఆప్ ప్రభుత్వంలోని మంత్రి రవ్‌జోత్ సోదరీమణుల గౌరవానికి భంగం కలిగించారు. ప్రభుత్వం వెంటనే ఆయన్ను మంత్రి పదవి నుంచి తొలగించాలి” అని డిమాండ్ చేశారు. ఈ పోస్టుకు ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌లను ట్యాగ్ చేశారు.

**ఫొటోలు నకిలీవి... రాజకీయ కుట్ర : మంత్రి స్పందన**

ఈ వివాదంపై మంత్రి రవ్‌జోత్ సింగ్ వెంటనే స్పందించారు. “వీటన్నీ ఏఐ సాయంతో తయారుచేసిన నకిలీ ఫొటోలు. రాజకీయంగా నన్ను పరాభవ పరిచే ప్రయత్నమే కాదు... ఓ మహిళ గౌరవాన్ని కూడా దిగజార్చే పని చేశారు. సమాజంలో మహిళల పట్ల వారికి గల గౌరవం ఎంతటిదో ఈ సంఘటన చూపించింది. లూథియానా ఉపఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ఈ కుట్రకు పాల్పడ్డారు” అని ఆరోపించారు. ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కూడా వెల్లడించారు. తన మాజీ భార్యతో ఉన్న వ్యక్తిగత చిత్రాలను ఏఐ ద్వారా మార్ఫింగ్ చేసి ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దళిత కుటుంబానికి చెందిన వాడిని కావడంతో తనను టార్గెట్ చేశారని కూడా ఆయన అన్నారు.

**మంత్రికి పార్టీ మద్దతు**

ఈ వ్యవహారంపై ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర యూనిట్ చీఫ్ అమన్ అరోరా

స్పందిస్తూ, మంత్రికి పూర్తి మద్దతుగా నిలుస్తామని ప్రకటించారు. “అకాలీదళ్ మురుగు రాజకీయాలకు దిగజారింది. వీటి ద్వారా ప్రజలను మభ్యపెట్టాలనుకుంటోంది” అని విమర్శించారు.

**విపక్షాల ఆగ్రహం.. అధికార పక్ష రక్షణ**

ఈ ఫొటోలు నిజమైనవా? నకిలీనా? అన్న విషయంపై ఇప్పటికీ స్పష్టత లేదు. కానీ ఈ వ్యవహారం పంజాబ్ రాజకీయాల్లో హాట్ టాపిక్ అయింది. లూథియానా ఉపఎన్నికల నేపథ్యంలో ఈ ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. అధికార పక్షం దీనిని నిఖార్సైన కుట్రగా అభివర్ణిస్తుండగా, విపక్షాలు మాత్రం మంత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. మొత్తానికి ఈ వివాదం పంజాబ్ రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇలా ఆరోపణలు, ప్రతిఆరోపణలతో రాష్ట్ర రాజకీయాల్లో ఉద్రిక్తత పెరుగుతున్నది. అధికార, విపక్షాల మధ్య ఈ మాటల యుద్ధం ఎక్కడికి దారి తీస్తుందో వేచి చూడాలి.

# జగన్ ది పెద్ద ప్లానే కదా !

**హైదరాబాద్ పెన్ పవర్:**వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్ పెద్ద ప్లాన్ లో ఉన్నారా అన్న చర్చ సాగుతోంది. ఆయన వ్యూహాలు కార్యాచరణను చూస్తే కనుక ఇలాంటిదేదో ఉందని అనిపిస్తోంది. ఇంతకీ విషయం ఏమిటి అంటే జగన్ ఇపుడు ఏమి మాట్లాడుతున్నాడో కూటమి నేతలకు అసలు అర్ధం కావడం లేదు అంటున్నారు.



సాధారణంగా కూటమి అధికారంలో ఉంటే మరో బలమైన సామాజిక వర్గంగా ఉన్న రెడ్డీలు భయపడతారు కానీ ఈసరి సీన్ రివర్స్ లో ఉంది అని అంటున్నారు. ఇక వైసీపీ అధికారంలో ఉన్నపుడు అమరావతి రాజధాని కమ్మ వారి కోసమే అని ఆ పార్టీ నేతలు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అంతే కాదు వైసీపీ అధికారంలో ఉన్నపుడు వైసీపీలో చాలా మంది ఫైర్ బ్రాండ్ లీడర్స్ ఉండేవారు.

వారంతా అప్పటి ప్రతిపక్షం అయిన టీడీపీ మీద హాట్ కామెంట్స్ చేసేవారు. వల్లభనేని వంశీ కొడాలి నాని వంటి వారు రెచ్చిపోతూ ఒక స్థాయి దాటి కూడా మాట్లాడేవారు. వారు చేసే విమర్శలు కూడా సభ్య సమాజంలో చాలా మంది జీర్ణించుకోలేని విధంగా ఇబ్బందిగా ఉండేవని అంటారు.ఇలా ఆనాడు వారు చేసిన విమర్శల ఫలితంగా హద్దూ అదుపూ లేని నోటి దురుసు వల్ల జైలు పాలు అవుతున్నారు. చాలా మంది నేతలు బొక్క బోర్లా పడ్డారు కూడా అని అంటున్నారు. ఇక ఏపీలో చూసుకుంటే రాజకీయ వైరంతో పాటు సామాజిక వైరం కూడా పెద్ద ఎత్తున సాగుతూ వస్తోంది. ఇది దుష్పరిణామాలకు దారి తీసేలా ఉన్నా కూడా ఎందుకో అది అలా కంటిన్యూ అవుతోంది అని అంటున్నారు. ఈ నేపథ్యం నుంచి చూసుకున్నపుడు ఏపీలో 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమికి మొత్తం ఏపీలోని కమ్మ వారి జనాభాలో 98 శాతం ఓటు వేశారు అని అంచనాలుగా చెబుతారు. అంటే ఇది చాలా అరుదైన సందర్భం అన్న మాట.

ఒక కులం గంపగుత్తగా ఎపుడూ ఒక పార్టీకి ఓటేయదు. కానీ ఏపీలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇలా జరుగుతోంది అని సరిపెట్టుకోవాల్సిందే అంటున్నారు. వారు ఎందుకు వేశారు అంటే వైసీపీకి తాము టార్గెట్ అయ్యామన్నది గుర్తించే అని అంటున్నారు. ఈ విషయంలో వైసీపీ తానుగా చేసుకున్న తప్పులే ఉన్నాయని కూడా చెబుతారు.ఇక కమ్మ వారి దెబ్బ ఎలా ఉంటుందో తొలిసారి వైసీపీ 2024 ఎన్నికల్లో చవి చూసింది అని అంటున్నారు. దాంతో ఇన్నాళ్ళు వైసీపీ లోపలన అంతర్మథనం చెందినా కూడా సత్తెనపల్లి రెంటపాళ్ళ పర్యటనలో జగన్ నోటి వెంట వచ్చిన మాటలను చూస్తే కనుక కమ్మ వారి వైపు ఆయన సానుకూలంగా మాట్లాడారు అని అంటున్నారు.నిజానికి చూస్తే పల్నాడు ప్రాంతంలో రెడ్డి సామాజిక వర్గం ఆధిపత్యం ఎక్కువగా ఉంటుంది. రాజకీయంగా వారే ముందుండి అన్నీ నడుపుతారు. అలాంటి మరో బలమైన సామాజిక వర్గం ఆధిపత్యం ఉన్న ప్రాంతానికి జగన్ వెళ్ళి అక్కడ కమ్మల గురించి జగన్ మాట్లాడడమే రాజకీయ విశేషంగా చూస్తున్నారు.ఇది ఒక విధంగా చెప్పాలీ అంటే పక్కా రాజకీయ వ్యూహంగానే అంతా అంటున్నారు. తమ పార్టీకి చెందిన కమ్మ వారిని ఎందుకు వేధిస్తున్నారు అని జగన్ సూటిగానే చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆ విధంగా ఆయన కమ్మ సామాజిక వర్గం వైపు సాఫ్ట్ కార్నర్ తీసుకున్నట్లుగా తన వైఖరిని తేటతెల్లం చేశారు అని అంటున్నారు. ఇలా సడెన్ గా జగన్ నోటి నుంచి ఒక బలమైన సామాజిక వర్గానికి అనుకూలంగా మద్దతుగా వ్యాఖ్యలు రావడం మీద చర్చ సాగుతోంది.

అసలు జగన్ ఎందుకు ఈ విధంగా మాట్లాడాల్సి వచ్చిందో ఆయన వ్యాఖ్యల వెనక అర్ధమేంటి అన్నది ఎవరికీ అర్ధం కావడం లేదు అని అంటున్నారు. ఇక చూస్తే కనుక తాను అధికారంలో ఉన్నపుడు కమ్మ వారిని దగ్గరకు రానీయకుండా జగన్ వ్యవహరించారు అని టీడీపీ కూటమి నేతలు అంటున్నారు. కమ్మ సామాజిక వర్గం మీద కక్ష కట్టినట్లుగా ఆనాడు వైసీపీ ఏలుబడిలో వ్యవహరించారు అని కూడా గుర్తు చేస్తున్నారు.అలాంటిది ఇపుడు వారి మీద ప్రేమ ఎక్కువ అయినట్లుగా జగన్ తాజా కామెంట్స్ ఉన్నాయని ఎకసెక్కమాడుతున్నారు. అయితే ఏపీ పాలిటిక్స్ లో కమ్మ వారి పవర్ ఏమిటి అన్నది జగన్ కి 2024 ఎన్నికల తరువాత తెలిసి వచ్చిందని అంటున్నారు. ఏపీలో ప్రధానమైన సామాజిక వర్గంలో పెట్టుకుంటే రాజకీయంగా ఎంతటి ఇబ్బందులు వస్తాయో కూడా ఆయనకు బాగా అర్ధం అయిన మీదటనే ఈ తరహా వ్యాఖ్యలు చేసి ఉంటారని అంటున్నారు.

మరి ముందు ముందు జగన్ తన పార్టీ పరంగా ఆ సామాజిక వర్గానికి ఇచ్చే ప్రాధాన్యతను బట్టి మాత్రమే వైసీపీ స్టాండ్ ఏమిటి చూడాలని అంటున్నారు. ఏది ఏమైనా జగన్ చేసిన ఈ వ్యాఖ్యల వెనక ఎన్నో అర్ధాలు పరమార్ధాలు వ్యూహాలు ఉన్నాయని అంటున్నారు.

# ఈటల బయటపడేందుకు ముహూర్తం చూసుకుంటున్నారా?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఈటల రాజేందర్ బీజేపీ నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తుంది. ఆయన అందులో ఇమడలేకపోతున్నారు. అయితే కేంద్రంలో అధికారంలో ఉండటంతో ఇప్పుడే ఆ పనిచేయకపోవచ్చు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఈటల రాజేందర్ బీజేపీ నుంచి బయటపడే ఛాన్స్ ఉందని అంటున్నారు. నిజానికి బీజేపీ సిద్ధాంతాలకు ఈటల ఆలోచనలకు అసలు పొంతన లేదు. ఈటల రాజేందర్ మావోయిస్టు ఉద్యమాల నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర మంత్రి కాగలిగారు. బీఆర్ఎస్ లో ఉద్యమకాలం నుంచి పనిచేసి కేసీఆర్ కు చేదోడు వాదోడుగా నిలిచారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించక ముందు కూడా కేసీఆర్ ఈటల రాజేందర్ కు ప్రయారిటీ ఇచ్చారు. శాసనసభలో పార్టీ నేతగా అవకాశం కల్పించారు.

**బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి...**

తర్వాత కేసీఆర్ వైఖరి వల్లనో, తనకు మంత్రి పదవి ఇచ్చినా తన మాటలు చెల్లుబాటు కావడం లేదన్న అక్కసుతోనే ఈటల రాజేందర్ గులాబీ పార్టీని లక్ష్యంగా చేసుకుని మాట్లాడారు. కేసీఆర్ కు కాలేలా మాటలు మాట్లాడటంతో కేబినెట్ నుంచి బయటకు పంపారు. దీంతో ఆయన కాంగ్రెస్ లో చేరాలనుకున్నప్పటికీ అక్కడ తనకు రక్షణ లేదని భావించి ఈటల రాజేందర్ బీజేపీలో అనివార్యంగా చేరాల్సి వచ్చింది. బీజేపీ కేంద్రంలో ఉండటం, తనపై భూముల ఆక్రమణల కేసులు నమోదు కావడంతో ఊపిరి సలపని పరిస్థితుల్లో కమలం పార్టీలో సేద తీరేందుకు సిద్ధమయ్యారు. బీజేపీలో రాను రాను తన పరిస్థితి ఏంటో తెలిసిపోయింది. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే అవకాశం లేదు. కేంద్రంలో అధికారంలోకి వచ్చినా తనకు మంత్రి పదవి సీనియర్ నేతలను దాటి తనకు అందే అవకాశాలు అంతంత మాత్రమేనన్న అంచనాకు వచ్చారు.

**పరోక్ష సంకేతాలు...**

అందుకే ఆయన తిరిగి బీఆర్ఎస్ వైపు చూస్తున్నారంటున్నారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు పిలిచినప్పుడు కూడా ఈటల రాజేందర్ అప్పటి ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడారంటున్నారు. అంతటితో ఆగకుండా తనతో బీఆర్ఎస్ నేతలకు మంచి సంబంధాలున్నాయన్నఈటల, కేసీఆర్ మినహా తనతో అందరూ మాట్లాడుతున్నారని ఒక ఛానెల్ ఇంటర్వ్యూలో చెబుతూ బీజేపీకి సిగ్నల్స్ పరోక్షంగా పంపినట్లయిందని అంటున్నారు. తనకు ప్రాధాన్యత దక్కకుంటే పార్టీ వీడతానని కూడా చెప్పకనే ఆయనచెప్పినట్లు స్పష్టమవుతుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కూడా తనకు రానివ్వకుండా కొందరు అడ్డంపడ్డారని అందుకే బీజేపీలో ఉండి కేవలం పార్లమెంటు సభ్యుడిగానే మిగిలి పోవాల్సి ఉంటుందని ఆయన ఒక అభిప్రాయానికి వచ్చినట్లుచెబుతున్నారు.

**ఎంపీగా ఉన్నా...**

2024లో జరిగినలోక్ సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నియోజకవర్గం అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడంతో తన వల్లనే ఎనిమిది పార్లమెంటు స్థానాలు తెలంగాణలో బీజేపీకి వచ్చాయన్న నమ్మకంతో ఉన్న ఈటల రాజేందర్ కేంద్ర మంత్రి పదవిపై ఆశలు పెంచుకున్నారు. కానీ మోదీ ఈటల వైపు చూడలేదు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు కేంద్ర మంత్రి పదవి వరించింది. బీజేపీలో ఉంటే తన రాజకీయ ఎదుగుదల ఉండదని భావిస్తున్న ఈటల రాజేందర్ ఎంపీగా ఉన్నప్పటికీ ఢిల్లీలో కూడా తాను ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నట్లు అర్థమయింది. బీజేపీలో కొనసాగితే తనకు భవిష్యత్ లోనూ పదవియోగం లభించదని భావించి ఆయన బీజేపీ నుంచి బయటకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారని అంటున్నారు. ఈటల రాకను బీఆర్ఎస్ నేతలు కూడా కోరుకుంటుండటంతో ఆయన చేరిక ఎంతో దూరం లేదంటున్నారు.

## 24వ తేదీ వరకూ జోరు వానలు తప్పవు.. ఎల్లో అలెర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో వానలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, అదే సమయంలో తెలంగాణలో ఉష్ణోగ్రతలు కనిష్టంగా నమోదవుతాయని, ఆంధ్రప్రదేశ్ లో మాత్రం గరిష్టంగానే ఉంటాయని చెప్పింది. తెలంగాణలో ముప్పయి డిగ్రీలకు లోపు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ఆంధ్రప్రదేశ్ లో మాత్రం ముప్పయి నుంచి ముప్పయి ఐదు డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 24వ తేదీ వరకూ వర్షాలు పడతాయనితెలిపింది.


**తెలంగాణలో ఈ ప్రాంతాల్లో...**

పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన జల్లులు పడతాయని తెలిపింది. అదే సమయంలో రెండు రాష్ట్రాల్లో ఉక్కపోత వాతావరణం నెలకొంటుందని చెప్పింది. బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని తెలిపింది. గంటకు ముప్పయి నుంచి నలభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. గురువారం అంటే ఈరోజు మాత్రం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించింది.

**ఏపీలో ఈ జిల్లాల్లో...**

ఆంధ్రప్రదేశ్ లోనూ పలుజిల్లాల్లో భారీ వర్షాల నుంచి మోస్తరువర్షాలు పడతాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. పగటి పూట ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని, సాయంత్రం వేళ వర్షంపడే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతోనూ, నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదలడం వల్ల వర్షాలు పడతాయని తెలిపింది. అదేసమయంలో బలమైనఈదురుగాలులతో కూడిన వర్షం పడుతుందని, గంటకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని చెప్పింది. ప్రధానంగా చిత్తూరు, శ్రీసత్యసాయి,అనంతపురం, నంద్యాల, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో వర్షం కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరింది.

## లిక్కర్ స్కామ్ లో ఇక రాజకీయ నేతలు వరస అరెస్ట్ లు తప్పదా?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో ఎప్పుడు ఏంజరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటి వరకూ ఈ కేసులో తొమ్మిది మంది అరెస్టయ్యారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అరెస్ట్ తో ఇక వరసగా రాజకీయ నేతలు అరెస్ట్అవుతారన్న ప్రచారం జరుగుతుంది. 2019 నుంచి 2024 మధ్య మద్యంవిక్రయాల్లో పెద్దయెత్తున కుంభకోణం జరిగిందని ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం ను ఏర్పాటు చేసింది. కొన్ని నెలల నుంచి దీనిపై సుదీర్ఘంగా దర్యాప్తు చేస్తున్న సిట్అధికారులు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇచ్చిన క్లూ ఆధారంగా రాజ్ కేసిరెడ్డిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో రాజ్ కేసిరెడ్డి కీలక నిందితుడని పేర్కొన్నారు.

**ఈ కేసులో ఇప్పటికే తొమ్మిది మంది...**

ఇదే కేసులో రాజ్ కేసిరెడ్డి, చాణక్య, పైలా దిలీప్, సజ్జల శ్రీధర్ రెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఇక తాజాగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కూడా అరెస్టయ్యారు. ఆయనతో పాటు చెవిరెడ్డి సన్నిహితుడు వెంకటేశ్ నాయుడును కూడా అరెస్ట్ చేశారు. ఇక ఇదే కేసులో రాజంపేట పార్లమెంటు సభ్యులు మిధున్ రెడ్డి పేరు బాగా ప్రచారంలో ఉంది. మిధున్ రెడ్డి ఇప్పటికే తనను అరెస్ట్ చేయవద్దంటూ ముందస్తు బెయిల్ కోసం న్యాయస్థానాన్నిఆశ్రయించారు. అదే సమయంలో ఈ కేసులో బిగ్ బాస్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తుంది. దీంతో చెవిరెడ్డి తర్వాత ఎవరు అరెస్టవుతారన్న దానిపై ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

**ఇద్దరిలో ఎవరు?**

లిక్కర్ స్కామ్ కేసులో 37, 38 నెంబరు నిందితులుగా ఉన్నవారిని అరెస్ట్ చేయడంతో ఇక తర్వాత ఎవరన్నది హాట్ టాపిక్ గా మారింది. కోట్లాది రూపాయలను విదేశాలకు తరలించారని ఇప్పటికే ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా కేసు నమోదు చేశారు. రిమాండ్ లో ఉన్న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప, రాజ్ కేసిరెడ్డిలను విచారించారు. మనీలాండరింగ్ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ కూడా దర్యాప్తు చేస్తుంది. అయితే చెవిరెడ్డి అరెస్ట్ తో రాజకీయ నేతల అరెస్ట్ ల పర్వం ప్రారంభమయినట్లే కనిపిస్తుంది. ఇక దీంతో తర్వాత మిధున్ రెడ్డి ని అదుపులోకి తీసుకుంటారా? లేక అంతకంటే అత్యున్నత స్థాయి వ్యక్తిని అరెస్ట్ చేస్తారా? అని వైసీపీ నేతల్లో టెన్షన్ మొదలయింది.

## టిక్‌టాక్‌కు మరో ఛాన్స్.. నిషేధంపై గడువు పెంచిన ట్రంప్




హైదరాబాద్ పెన్ పవర్:అమెరికాలో టిక్‌టాక్ నిషేధం మళ్లీ వాయిదా పడింది. అమెరికాలో టిక్ టాక్ నిషేధంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మనసు మార్చుకున్నారు. చైనా కంపెనీకి చెందిన ప్రముఖ వీడియో షేరింగ్ టిక్ టాక్ పై నిషేధంపై గడువును మరో 90 రోజులకు పెంచారు. చైనా మాతృసంస్థ బైట్ దాన్స్ నుంచి టిక్ టాక్ ను లాక్కునే ప్రయత్నంలో అమెరికా ప్రభుత్వం డీల్ కుదుర్చుకునేందుక మరోసారి గడువు పెంచారు ట్రంప్. టిక్ టాక్ కంపెనీలో అధిక వాటా యూఎస్ యాజమాన్యంలోకి రావాలని ట్రంప్ ఆశిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఫేమస్ అయిన ఈ వీడియో షేరింగ్ యాప్ కు ఇది ట్రంప్ మూడో ఆఫర్. టిక్ టాక్ ను పూర్తిగా బ్యాన్ చేయాలని ట్రంప్ ఉద్దేశ్యం కాదు.. అమెరికా ప్రభుత్వంతో సురక్షితమైన డీల్ కోసమే 90 రోజులు గడువు ఇచ్చారని అమెరికా ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ చెప్పారు. ట్రంప్ చైనాపై భారీ సుంకాలు విధించిన తర్వాత అమెరికాలో టిక్ టాక్ కార్యకలాపాలపై గతంలో ఉన్న ఒప్పందాలకు అడ్డంకిగా మారింది. దీంతో బైట్ దాన్స్ అమెరికాతో డీ ల్ కుదుర్చుకోవాలని చైనా అనుమతి తీసుకోవాలని టిక్ టాక్ ఖరాఖండిగా చెప్పేసింది.

టిక్ టాక్కు చైనాతో ఉన్న సంబంధాలు అమెరికా జాతీయ భద్రతపై ఆందోళనలు లేవనెత్తాయి. అమెరికా యూజర్ డేటాను చైనీస్ కమ్యూనిస్టు పార్టీ యాక్సెస్ చేసే అవకాశం ఉందని భయాన్ని వ్యక్తం చేసింది. దీంతో 2025 జనవరి 19న టిక్ టాక్ అమెరికా చట్టాలను అమలు చేయడం గానీ, టిక్ టాక్ విక్రయించడం గానీ, లేదా పూర్తిగా నిషేధం గానీ ఉంటుందని ట్రంప్ ప్రభుత్వం గడువిచ్చింది. ఆ గడువును జూన్ వరకు ఉండగా మరోసారి సెప్టెంబర్ వరకు పొడిగించారు ట్రంప్.

## హైదరాబాద్ రాజేంద్రనగర్ లో ఫుట్ పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసీ కొరడా..

హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్ పరిధిలో ఆక్రమణలపై అటు హైడ్రా, ఇటు జీహెచ్ఎంసీ ఉక్కుపాదం మోపుతున్నాయి. ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదుల మేరకు ఎప్పటికప్పుడు కూల్చివేతలు చేపడుతున్నారు అధికారులు. ఈ క్రమంలో గురువారం ( జూన్ 19 ) రాజేంద్రనగర్ లో ఫుట్ పాత్ ఆక్రమణలను కూల్చేశారు జీహెచ్ఎంసీ అధికారులు. రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లిలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్ ను ఆక్రమించి ఏర్పాటు చేసిన వాణిజ్య వ్యాపార సముదాయాలను కూల్చేశారు అధికారులు.

డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు భారీ పోలీసు బందోబస్తు మధ్య జేసీబీలతో కూల్చివేతలు చేపట్టారు అధికారులు. రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్ పై ఉన్న ఆక్రమణలతో ఇబ్బంది తలెత్తుతోందంటూ స్థానికులు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగారు టౌన్ ప్లానింగ్ అధికారులు. ఆక్రమణలకు పాల్పడింది ఎంతటివారైనా సహించేది లేదని.. కూల్చివేతల విషయంలో రాజీ పాడేది లేదని హెచ్చరించారు అధికారులు.కాగా.. ఈ మధ్య కాలంలో హైడ్రా దూకుడు పెంచింది. మే 19న మియాపూర్ హైదర్ నగర్ దగ్గర సర్వే నంబర్ 145/3లో అక్రమ నిర్మాణాలను హైడ్రా తొలగించింది. 9ఎకరాల 30గుంటల్లో 25 ఏళ్ల కిందట డైమండ్ హిల్స్ పేరిట అసోసియేషన్ ఏర్పాటు చేశారు. లే ఔట్ లో మొత్తం 79 ప్లాట్లు ఉన్నాయి. ఆ స్థలాన్ని పలువురు వ్యక్తులు ఆక్రమించారు. 9 నెలల కిందట హెచ్ఎండిఏ లేఔట్ గా తేల్చింది హైకోర్టు. ఖాళీ చేయాలని హైకోర్టు ఆదేశించినా కబ్జా దారుల ఖాళీ చేయలేదు.దీంతో బాధితులు హైడ్రాను ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఉదయం నుంచి కూల్చివేతలు మొదలు పెట్టింది హైడ్రా. గ్రేటర్ పరిధిలో కబ్జాకు గురైన చెరువులు,కుంటలు,ప్రభుత్వ స్థలాలను హైడ్రా పర్యవేక్షిస్తోంది. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమించి కట్టిన నిర్మాణాలను,పర్మిషన్ లేకుండా ఇష్టారీతిన కట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చేస్తుంది. స్థానికుల ఫిర్యాదు మేరకు స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చేస్తోంది.

# మరోసారి షాకిచ్చిన బంగారం ధరలు.. ఇక పరుగు ఆపేట్లు లేవుగా

హైదరాబాద్ పెన్ పవర్:బంగారం ధరలు ఎప్పుడు పెరుగుతాయో తెలియదు. తగ్గేది అనేది జరగదు. బంగారం ధరలు మరింత భారంగా మారిపోతున్నాయి. వినియోగదారులను నిరాశపరుస్తున్నాయి. బంగారం ధరలు దాదాపుగా పెరుగుతూనే ఉంటాయి. ఇటీవల కాలంలో ధరలు పెరగడం అనేది వారంలో ఆరురోజులపాటు జరుగుతుంది. అయితే బంగారం ధరలు ఇంకా పెరుగుతాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అనేక కారణాలతో బంగారం ధరలు నేటి కంటే మరింతగా పెరిగే అవకాశాలు లేకపోలేదని చెబుతున్నారు. అంతర్జాతీయంగా తలెత్తిన పరిణామాలు, ఇజ్రాయిల్ - ఇరాన్ ల మధ్య యుద్ధం కూడా బంగారం ధరలు పెరగడానికి ఒక కారణమని మార్కెట్ నిపుణులు అంటున్నారు.



**ఏడాది ఆరంభం నుంచే...**

ఈ ఏడాది ఆరంభం నుంచే బంగారం ధరలు పెరుగుతున్నాయి. అప్పుడు ఇజ్రాయిల్ - ఇరాన్ మధ్య యుద్ధం లేకపోయినప్పటికీ ధరలు పెరిగాయని కొందరు గుర్తు చేస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మాత్రమే బంగారం ధరలు పతాక స్థాయికి చేరుకున్నాయని అంటున్నారు. బంగారం ధరలు ఇప్పటికే పది గ్రాములు లక్ష రూపాయలు దాటేశాయి. వెండి ధరలు లక్ష ఇరవై వేల రూపాయలను మించిపోయింది. ఇలా ధరలు పెరుగుతండటంతో అమ్మకాలు తగ్గడంతో జ్యుయలరీ దుకాణాలు అనేక ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. తరుగులోనూ, పాత రేట్లకే బంగారం ధరలు విక్రయిస్తామని చెబుతున్నప్పటికీ కొనుగోలుకు ముందుకు రావడం లేదు.

**స్వల్పంగా పెరిగి...**

ఇక పెట్టుబడిగా చూసేవారు కూడా వెనక్కు తగ్గుతున్నారు. బంగారంపై పెట్టుబడి సురక్షితం కాదని వారు భావించి ఇప్పట్లో కొనుగోలు చేయడం మంచిది కాదని నమ్ముతున్నారు. ఈరోజు దేశంలో బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. వెండి ధరల్లో కూడా స్వల్ప పెరుగుదల కనిపించింది. పది గ్రాముల బంగారం ధరపై పది రూపాయలు పెరిగింది. కిలో వెండి ధరపై వంద రూపాయలు పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో బంగారం, వెండి ధరలు

ఉదయం ఆరు గంటలకు నమోదయిన ధరలు మధ్యాహ్నానికి మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 92,500 రూపాయలకుగా నమోదయింది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,00,920 రూపాయలకు చేరుకుంది. కిలో వెండి ధర 1,21,100 రూపాయలుగా ట్రేడ్ అవుతుంది.

# వారణాసిని దించేస్తున్నారటగా.. రాజమౌళియా మజాకా?




హైదరాబాద్ పెన్ పవర్:రాజమౌళి సినిమా అంటే కాసుల వర్షం కురిపిస్తుంది. నిర్మాతలుగా వచ్చిన వారు ఎన్ని కోట్లు ఖర్చు చేయడానికి అయినా వెనకాడరు. ఎందుకంటే రిటర్న్స్ కూడా అదే రేంజ్ లో ఉంటాయి. సుదీర్ఘకాలం సినిమా తీసినా హీరో దగ్గర నుంచి టెక్నీషియన్ల వరకూ రాజమౌళి దర్శకత్వంలో పనిచేయడానికి తహతహలాడుతుంటారు. రాజమౌళి సినిమా పూర్తయ్యే లోపు మరో మూడు సినిమాలు సులువుగా పూర్తి చేసే వీలున్నా పేరు కోసం.. ప్రతిష్ట కోసం ఆయన వెంట నడుస్తారు. అందుకే రాజమౌళి తెలుగు చిత్ర పరిశ్రమకే కాదు.. బాలీవుడ్ కు మించి పోయిన దర్శకుడిగా ఎదిగారు. అమరశిల్పి జక్కన్న చెక్కిన శిల్పాలా ఈ జక్కన్న తాను దర్శకత్వం వహించిన సినిమాను తెరకెక్కించే ప్రయత్నం చేస్తారు.

**షూటింగ్ ప్రారంభమై..**

రాజమౌళి ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబుతో ఒక మూవీ రెడీ అవుతుంది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమయింది. దీనికి సంబంధించి ఒక వార్త వైరల్ గామారింది. ఈ సినిమా కోసం వెయ్యి కోట్ల రూపాయలను వెచ్చించేందుకు సిద్ధమవుతున్నారు. ఎస్ఎస్ఎంబీ 29 పేరిట ఈ చిత్రం షూటింగ్ శరవేగంగాపూర్తి చేసుకుంటుంది. అయితే తాజాగా అందుతున్న సమాచారం మేరకు ఈ సినిమాలో వారణాసికి సంబంధించిన సీన్స్ తీయాల్సి ఉంది. అయితే నిజానికి వారణాసిలోనే సినిమా చిత్రీకరణ జరపాలని చూసినప్పటికీ అక్కడ అనుమతులతో పాటు అనేక రకాలైన ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన రాజమౌళి ఆ ఆలోచన ను విరమించుకున్నారు.

**యాభై కోట్లతో...**


వారణాసిని ఇక్కడే నిర్మించాలని నిర్ణయించారు. వారణాసి నగరాన్ని ఫిలిం సిటీలో నిర్మించేందుకు సిద్ధమయ్యారట. ఇందుకోసం యాభై కోట్ల ఖర్చుతో ఏకంగా వారణాసి నగరాన్ని నిర్మిస్తున్నారట. ఇందులో వారణాసిలో గంగా ఘాట్ లు, ఆలయంతో పాటు ఆ వీధులన్నింటినీ ఇక్కడ కృత్రిమంగా ఏర్పాటు చేయనున్నారు. పురాతన దేవాలయాలు కూడా ఇందులో రూపుదిద్దుకుంటున్నాయట. ఈ నేపథ్యంలోనే సెట్ పనులను శరవేగంగా చేస్తున్నారని తెలిసింది.వారణాసి నగరంలో షూటింగ్ ఎంత సేపు ఉంటుందో తెలియదు కానీ, అందుకోసం యాభై కోట్ల రూపాయలు వెచ్చించి సెట్స్ వేయాలని నిర్ణయించడం ఇప్పుడు బాలీవుడ్ తో పాటు అన్ని రికార్డులను బ్రేక్ చేసేలా కనిపిస్తుంది. బాలీవుడ్, టాలీవుడ్ లో ఇప్పటి వరకూ ఇంత భారీ బడ్జెట్ సినిమా రూపుదిద్దుకోలేదట. మొత్తం మీద రాజమౌళి ఎస్ఎస్ఎంబీ 29 తో మరో హిస్టరీని క్రియేట్ చేస్తున్నారనే చెప్పాలి.

# ఈ అలవాట్లు ఉన్నాయా!మానుకోండి..అవి కిడ్నీ క్యాన్సర్ కు దారితీయొచ్చు

**హైదరాబాద్ పెన్ పవర్:**"హెల్త్ ఈజ్ వెల్త్" అంటుంటారు నిజమే.. ఆరోగ్యంగా ఉంటే అదే సంపద..హోదా, ఆనందం ఇలా అన్నింటిని తెచ్చిపెడుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మనం తీసుకునే ఆహారం, బిజీలైఫ్, ముఖ్యంగా అలవాట్లు ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తున్నాయి. చిన్న వయసులోనే ఆర్గాన్స్ చెడిపోవడం, సీరియస్ హెల్త్ ఇష్యూస్ తో కొందరు ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది. ముఖ్యంగా గుండె, కిడ్నీ, లివర్ వంటి శరీరంలో ప్రధాన భాగాలు చెడిపోయి ఆస్పత్రుల పాలై కొన్ని కొన్ని సార్లు ప్రాణాలు కోల్పోతున్నారు. మన శరీరంలో ఓ కీలకమైన ఆర్గాన్ కిడ్నీలు..ఇవి కొన్ని రకాల చెడు అలవాట్లతో ప్రమాదంలో పడుతున్నాయి. చాలా మంది కిడ్నీ క్యాన్సర్ బారినపడుతున్నారు. కిడ్నీ క్యాన్సర్ కు ముఖ్యంగా రోజువారీ అలవాట్లే ప్రధాన కారణం అంటున్నారు డాక్టర్లు.. అవేంటో చూద్దాం..

మూత్రపిండాల క్యాన్సర్ తరచుగా దాని ప్రారంభ దశలో లక్షణాలు ఏమీ కనిపించవు. భారతదేశంలో ముఖ్యమైన ఆరోగ్య సమస్యల్లో ఇదొకటి. మూత్రంలో నిరంతరం రక్తం, నొప్పి వంటివి కనిపిస్తే మూత్రపిండాల క్యాన్సర్ కు సంకేతాలుగా కనిపిస్తున్నా.. ఎటువంటి లక్షణాలు లేకుండా కూడా కిడ్నీక్యాన్సర్ కేసులు నమోదు అవుతున్నాయని తెలుస్తోంది. అయితే పెద్ద ప్రశ్న ఏమిటంటే కిడ్నీ క్యాన్సర్ కేసులు ఎందుకు పెరుగుతున్నాయి ?దీనికి సమాధానం చాలా వరకు దైనందిన అలవాట్లలోనే ఉందంటున్నారు నిపుణులు.

కిడ్నీ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే రోజువారీ అలవాట్లు:



పొగతాగడం..పొగతాగడం అనేది కిడ్నీ క్యాన్సర్‌కు అత్యంత ప్రమాద కారకాల్లో ఒకటి. ఇది మూత్రపిండాలలోని రక్త నాళాలను దెబ్బతీస్తుంది. కణితి ఏర్పడే అవకాశాలను పెంచుతుంది.

ఊబకాయం, సరైన ఆహారం లేకపోవడం

అధిక బాడీ మాస్ ఇండెక్స్ కిడ్నీ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ప్రాసెస్ చేసిన ఆహారం ,ఎర్ర మాంసం ,చక్కెర పానీయాలు అధికంగా ఉన్న ఆహారం కిడ్నీ క్యాన్సర్ ప్రమాదాన్ని మరింత పెంచుతాయి. పండ్లు, కూరగాయలు ,తృణధాన్యాలు అధికంగా ఉండే సమతుల్య ఆహారం మూత్రపిండాలకు రక్షణగా ఉంటుంది.

**కెమికల్స్ వల్ల..**

ట్రైక్లోరోఎథిలీన్ (లోహ శుభ్రపరచడం,డ్రై క్లీనింగ్‌లో ఉపయోగిస్తారు) వంటి కొన్ని కెమికల్స్ వల్ల మూత్రపిండాల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. సరైన భద్రత పరికరాలను ఉపయోగించడం ద్వారాకిడ్నీ క్యాన్సర్ ను అరికట్టవచ్చు.

**అధిక ప్రోటీన్ సప్లిమెంట్లు వాడకం..**

ముఖ్యంగా అధిక ప్రోటీన్లు గల సప్లిమెంట్లు వాడినా, ఫిట్ నెస్ ట్రెండ్స్ కూడా కిడ్నీలపై అధిక ప్రభావాన్ని చూపుతాయంటున్నారు నిపుణులు. దీర్ఘకాలిక నష్టంతోపాటు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయంటున్నారు.

**హెల్త్ చెకప్ నిర్లక్ష్యంతో..**

క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ ఉంటే మూత్ర పిండాల సమస్యల పెరగొచ్చు. క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ చేయించుకుంటే ఉదాహరణకు స్కానింగ్ సమయంలో ప్రారంభ దశ మూత్రపిండ క్యాన్సర్లు యాదృచ్ఛికంగా బయటపడే ఛాన్స్ ఉంది.

**మూలికల వాడకంతో..**

ఏదైనా అనారోగ్యం అనిపించినప్పుడు చాలా మంది ఇచ్చిన సలహాలతో కొందరు మూలికలు వాడుతుంటారు. అవి మూత్రపిండాలకు హాని కలిగిస్తాయి. ఆ మందులలో భారీ లోహాలుంటాయి. ఇవి మూత్రపిండాలలోపేరుకుపోయి ప్రాణాంతకంగా మారే ఛాన్స్ ఉంటుందంటున్నారు నిపుణులు.

లక్షణాలు లేకపోయినా అల్ట్రాసౌండ్ లేదా %జు% స్కాన్‌లలో కనిపించే మూత్రపిండాల సంబంధిత ఫలితాలను విస్మరించవద్దని నిపుణులు గట్టిగా సలహా ఇస్తున్నారు. యూరాలజిస్ట్‌తో సకాలంలో సంప్రదించాలంటున్నారు. నెఫ్రాన్–స్పేరింగ్ సర్జరీతో క్యాన్సర్‌ను అరికట్టవచ్చంటున్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు అడుగులు వేస్తున్నప్పుడు కిడ్నీ క్యాన్సర్ తరుచుగా కనిపించే హెల్త్ ప్రాబ్లమ్ అని గుర్తుంచుకోవడం ముఖ్యం. ఇది ధూమపానం మానేయడం, బాగా తినడం, చురుకుగా ఉండటం ,క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా కిడ్నీల ఆరోగ్యాన్ని మీ చేతుల్లో పనిగా ఉంచుకోవచ్చు.

# బీజేపీ ఎమ్మెల్యే భార్యకు.. శ్రీమతి బీహార్ కిరీటం





**హైదరాబాద్ పెన్ పవర్:**రాజకీయ నాయకుల భార్యలు కొంతమంది ఇంటికే పరిమితం అయితే.. మరికొంతమంది మాత్రం తమ భర్తల పొలిటికల్ కెరీర్ లో కీరోల్ ప్లే చేస్తుంటారు. మరికొంతమంది తమకంటూ ఒక కెరీర్ ఎంచుకొని అందులో రాణిస్తుంటారు. ఈ బీజేపీ ఎమ్మెల్యే భార్య కూడా ఈ కోవకు చెందిన మహిళనే.. బీహార్ లోని తరారికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే విశాల్ ప్రశాంత్ భార్య.. ఐశ్వర్య రాజ్ మిసెస్ బీహార్ 2025 కిరీటాన్ని దక్కించుకున్నారు . ఎమ్మెల్యే భార్య, మాజీ ఎమ్మెల్యే కోడలు అయిన ఐశ్వర్య రాజ్ ఇటీవల జరిగిన మిసెస్ బీహార్ 2025 పోటీల్లో గెలుపొందారు.

మిసెస్ బీహార్ పోటీల్లో గెలుపొందిన సందర్భంగా తన ఇన్‌స్టాగ్రామ్ లో ఆసక్తికర పోస్ట్ షేర్ చేశారు ఐశ్వర్య రాజ్, "కలల నుండి వాస్తవికతకు మీ అమ్మాయి ఇప్పుడు మిసెస్ బీహార్ 2025!" అంటూ ఆమె తన కుటుంబానికి, ఫాలోవర్స్ కి కృతజ్ఞతలు తెలుపుతూ పోస్ట్ షేర్ చేశారు. "ఈ కిరీటం కలలు కనే ధైర్యం చేసే ప్రతి మహిళ కోసం" అనే కాప్షన్ తో ఇన్‌స్టాగ్రాం లో పోస్ట్ చేశారు ఐశ్వర్య రాజ్.

ఇన్‌స్టాగ్రామ్‌లో 28,000 మందికి పైగా ఫాలోవర్లను కలిగి ఉన్న ఐశ్వర్య, అందం, ఫ్యాషన్, ప్రయాణం మరియు మాతృత్వంపై తన కంటెంట్ ను షేర్ చేస్తూ ఫేమస్ అయ్యింది. ఒకప్పుడు మోడలింగ్, సినిమాల్లో కెరీర్ పట్ల ఆసక్తి చూపించిన ఆమె, పెళ్లి తర్వాత ఆసక్తిని విరమించుకున్నట్లు తెలిపారు. తన భర్త ప్రోత్సాహంతో, ఇప్పుడు తన కలలను తిరిగి పొందుతున్నానని తెలిపారు ఐశ్వర్య రాజ్.

# హైదరాబాద్ అత్తాపూర్ లో విషాదం: గర్భిణి ప్రాణం తీసిన కారు డ్రైవర్ నిర్లక్ష్యం.. ఆర్టీసీ బస్సు కింద పడి..






**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ అత్తాపూర్ లో విషాదం చోటు చేసుకుంది. కారు డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండు గర్భిణి బలయ్యింది. గురువారం ( జూన్ 19 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిల్లర్ నంబర్ 198 దగ్గర హైవేపై జరిగిన ప్రమాదంలో సయ్యద్ ఆశ్ర అనే గర్భిణి మృతి చెందింది. హైవేపై నిర్లక్ష్యంగా కారు పార్క్ చేసి డోర్ తెరిచి పెట్టడంతో ఆర్టీసీ బస్సు కింద పడి గర్భిణి మృతి చెందింది.ఆశ్రపై నుంచి బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం, రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై కారును నిర్లక్ష్యంగా ఆపి డోర్ తెరవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడని తెలిపారు స్థానికులు. ఘటనపై పోలీసులకు

సమాచారం అందించారు స్థానికులు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.సర్వీస్ రోడ్లలో ఆక్రమ పార్కింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారూ స్థానికులు. డ్రైవర్ నిర్లక్ష్యానికి అన్యాయంగా నిండు గర్భిణి బలయ్యిందని.. ఈ దారుణానికి కారణమైన డ్రైవర్ ను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

# తన పార్టీకి మెడికల్ వింగ్ ప్రకటించిన హీరో విజయ్

- నటుడు విజయ్ 'తమిళగ వెట్రి కళగం' పార్టీలో నూతన వైద్య విభాగం ప్రారంభం
- డాక్టర్ టి. శరవణన్‌ను కోఆర్డినేటర్‌గా నియమించిన విజయ్
- వైద్య విభాగానికి 14 మంది సభ్యులతో జాయింట్ కోఆర్డినేటర్ల బృందం



**హైదరాబాద్ పెన్ పవర్:**కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తమ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసుకునే దిశగా మరో కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా గురువారం నాడు పార్టీ ప్రత్యేక వైద్య విభాగాన్ని ప్రారంభించింది. క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాలను విస్తరించుకోవడం, సామాజిక సంక్షేమ కార్యక్రమాలను ముమ్మరం చేయడం అనే తమ విస్తృత వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

టీవీకే అధ్యక్షుడు విజయ్ ఈ మేరకు ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య విభాగానికి తొలితరం ఆఫీస్ బేరర్ల వివరాలను కూడా ఆయన వెల్లడించారు. డాక్టర్ టి. శరవణన్‌ను ఈ విభాగానికి కోఆర్డినేటర్‌గా నియమించారు. పార్టీ ఆధ్వర్యంలో తమిళనాడు వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలకు ఆయన నేతృత్వం వహిస్తారు.

ఈ వైద్య విభాగం కార్యకలాపాలకు తోడ్పాటు అందించేందుకు, 14 మంది వైద్య నిపుణులతో కూడిన బృందాన్ని సంయుక్త కోఆర్డినేటర్లుగా నియమించారు. వీరిలో డాక్టర్ కె. విష్ణు, డాక్టర్ ఎం.ఎస్. రవి, డాక్టర్ ఎ. అరుణ్ ప్రసాద్, డాక్టర్ ఎస్. నరేష్, డాక్టర్ ఎస్. అరవింద్, డాక్టర్ టి. ప్రితీంగ, డాక్టర్ ఎస్. కార్తీక్, డాక్టర్ సిత్తార్ పాండియన్, డాక్టర్ ఎం. మణిమేఘలై, డాక్టర్ ఎం. హరి, డాక్టర్ సి. జగధ, డాక్టర్ సినోరా పి.ఎస్. మోహిత్, డాక్టర్ సి. తమిళినియన్, డాక్టర్ సి. వివేక్ పాండియన్ ఉన్నారు.

నూతనంగా నియమితులైన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ విజయ్ మాట్లాడుతూ, "నా మార్గదర్శకత్వం, ఆదేశాల మేరకు, ముఖ్యంగా పార్టీ నిర్మాణాత్మక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలకు సంబంధించి ఈ బృందం వైద్య విభాగం బాధ్యతలను నిర్వహిస్తుంది" అని చెప్పారు. టీవీకే ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ పర్యవేక్షణలో ఈ వైద్య విభాగం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

వైద్య విభాగానికి, దాని కార్యక్రమాలకు పూర్తిస్థాయిలో సహకరించాలని తమిళనాడు వ్యాప్తంగా ఉన్న టీవీకే కార్యకర్తలు, నాయకులకు విజయ్ పిలుపునిచ్చారు. "ఈ వైద్య నిపుణుల బృందం మా సామాజిక సంక్షేమ, ప్రజా సేవా లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తుందని నేను విశ్వసిస్తున్నాను" అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాజేంద్రనగర్ లో గంజాయి ముఠా అరెస్ట్.. ఐదు కిలోల గంజాయి, సెల్ ఫోన్లు స్వాధీనం..




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ రాజేంద్రనగర్ లో గంజాయి తరలిస్తున్న ముఠాను అరెస్ట్ చేసారు పోలీసులు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు గురువారం ( జూన్ 19 ) అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. బుద్వేల్ చెందిన డి.జగదీష్(22), చింతల్‌మెట్‌కు చెందిన ఎం.రాముకుమార్(23), బుద్వేల్‌కు చెందిన బి.మనోజ్(19), బి.నరేందర్(21)తో పాటు మహేష్ ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకువచ్చి అమ్ముతున్నట్లు గుర్తించారు పోలీసులు.

ముఠా పోలీసులను చూసి ఓవర్ యాక్షన్ చేయడంతో అనుమానం రావడంతో సినీ పక్కీలో చేజ్ చేసి... రాజేంద్రనగర్ పట్టుకొండ దగ్గర గంజాయి ముఠాను అరెస్ట్ చేశారు. ముఠా దగ్గర నుంచి ఐదు కిలోల గంజాయి, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.గంజాయిని స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు రాజేంద్రనగర్ పోలీసులు.

ఇటీవల కాలంలో హైదరాబాద్ లో గంజాయి ముఠా ఆగడాలు ఎక్కువైపోతున్నాయి.. నగరంలో హాష్ ఆయిల్, గంజాయి విక్రయిస్తున్న ముఠాను నార్త్? జోన్? టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద రూ.6.50 లక్షల విలువైన హాష్ ఆయిల్, గంజాయి, చరాస్, రెండు డాగర్లు, మూడు బైక్?లు, ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ సుదీంద్ర బుదవారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

నార్త్ జోన్? టాస్క్ ఫోర్స్?, మాసబ్ ట్యాంక్? పోలీసులు మాసబ్ ట్యాంక్ పింఛన్? ఆఫీస్ బస్ స్టాప్ సమీపంలో దాడులు నిర్వహించారు. సయ్యద్ ముర్తుజా అలీ హుస్సేన్, మహమ్మద్ ఫైజాన్, హర్షిత, సమీర్ అనే నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. గాజులరామారంలో నివసించే సామ్ అజయ్, వీరచారిని కూడా అరెస్టు చేశారు. నాగపూర్? నుంచి సరుకు తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తెలంగాణలో డిగ్రీ అడ్మిషన్ల గడువు పొడిగింపు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్–తెలంగాణ' (దోస్త్) మూడో విడత రిజిస్ట్రేషన్ల గడువును పొడిగిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు మరియు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపళ్ల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మండలి గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.పొడిగించిన గడువు ప్రకారం, అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ వరకు మూడో విడత దోస్త్ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. అదేవిధంగా, ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకునేందుకు కూడా జూన్ 25వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి సంబంధిత ఉత్తర్వులను జారీ చేసింది.రాష్ట్రంలో డిగ్రీ ప్రవేశాల ప్రక్రియను దోస్త్ ద్వారా మూడు విడతలుగా చేపడుతున్న విషయం తెలిసిందే. తాజా నిర్ణయంతో, ఇంకా దరఖాస్తు చేసుకోని విద్యార్థులకు మరో అవకాశం లభించినట్లయింది. గడువు పొడిగింపు నిర్ణయం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శాడిస్ట్ సాఫ్ట్ వేర్ మొగుడు.. మోజు తీరాక రెండో పెళ్లికి రెడీ..

## భర్త ఇంటి ముందు భార్య ధర్నా




**హైదరాబాద్ పెన్ పవర్:** తనకు న్యాయం చేయాలంటూ రంగారెడ్డి జిల్లాలో భర్త ఇంటి ముందు ధర్నాకు దిగింది ఓ యువతి. తన భర్త రెండో పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యాడని తనకు న్యాయం చేయాలని భర్త ఇంటి ముందు బైఠాయించింది యువతి. అసలేం జరిగిందంటే.. బండ్లగూడ జాగర్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్ షాకోట్ సాయి బాలాజీ నగర్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రీధర్ కుమార్ , పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సాఫ్ట్ వేర్ ఇంజినీర్ స్రవంతి లవ్ చేసుకున్నారు. నువ్వంటే అంటే నాకు ఇష్టం, నువ్వు లేకుండా బ్రతకలేను,నువ్వే నా సర్వస్వం అంటూ వెంటబడి స్రవంతిని 2020లో పెళ్లి చేసుకున్నాడు శ్రీధర్ . అతని ప్రేమ నిజమని నమ్మిన స్రవంతి తల్లిదండ్రులను ఎదురించి వివాహం చేసుకుంది.

వివాహం జరిగిన నాలుగు నెలల నుంచి నరకం చూపించిన సాడిస్ట్ సాఫ్ట్ వేర్ భర్త శ్రీధర్ కుమార్ పిల్లలు పుట్టకుండా భార్యను టాబ్లెట్స్ వేసుకొమ్మనే వేధించేవాడని భార్య స్రవంతి ఆరోపిస్తోంది . మోజు తీరిన తరువాత నీతో అవసరం లేదని తన భర్త ఇంటి నుంచి గెంటేశాడని... తాను వేరే అమ్మాయిని వివాహం చేసుకుంటానని బెదిరిస్తున్నాడని చెప్పింది. తనకు న్యాయం కావాలని.. న్యాయం జరిగేంత వరకు ఇంటి ముందు నుంచి కదిలేది లేదని బండ్లగూడలోని భర్త ఇంటి ముందు యువతి ధర్నాకు దిగింది.

### నలభై ఐదేళ్ల మహిళ.. 21 ఏళ్ల యువకుడితో

## లవ్.. చివరకు భర్తనే మర్డర్ చేసి?




**హైదరాబాద్ పెన్ పవర్:**నలభై ఐదేళ్ల మహిళ. పెళ్లయింది. భర్త పిల్లలనున్నారు. అయినా సరే ఆమె వివాహేతర సంబంధం పెట్టుకుంది. తనకంటే పథ్నాలుగేళ్ల చిన్నవాడితో లవ్ లో పడింది. చివరకు భర్తకు తెలియడంతో ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. రాజస్థాన్ లోని ఝుంఝునులో ఈ ఘటన చోటు చేసుకుంది. మరో వివాహేతర సంబంధం ఒక వ్యక్తిని బలి తీసుకుంది. హత్య చేసిన తర్వాత ప్రమాదంగా చూపించే ప్లాన్ వేశారు. కానీ పోలీసుల విచారణలో వీరి గుట్టు బయటపడింది. ఈ కేసులో నిందితురాలుపూనమ్ తో పాటు లవర్ కృష్ణకుమార్ లను పోలీసులు అరెస్ట్ చేశారు.

**రహదారిపై మృతదేహం ఉండటంతో...**

ఈ నెల 10వ తేదీన ఝుంఝునులోని పచేరి రహదారిపై పోలీసులు ఒక మృతదేహం గుర్తించారు. అయితే ఆ మృతదేహం సమీప గ్రామానికి చెందిన అనూప్ సింగ్ యాదవ్ ది గా గుర్తించారు. తొలుత అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు తమ విచారణను ప్రారంభించారు. అనూప్ కుమార్తె యాదవ్ కుమార్తె కూడా తన తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు విచారణ ప్రారంభించారు. అయితే అనూప్ యాదవ్ ను ఏ వాహనం ఢీకొన్నట్లు జాడ లేకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు విచారణ ప్రారంభించారు.

**రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి...**

ఇందులో అనూప్ యాదవ్ భార్య పూనమ్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఆమెను అరెస్ట్ చేసి తమదైన స్టయిల్ లో విచారించగా అసలు విషయం బయటకు వచ్చింది. హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు పూనమ్ తో పాటు ఆమె లవర్ కృష్ణకుమార్ కూడా ప్రయత్నించారని పోలీసుల విచారణలో వెల్లడయింది. మద్యం తాగించిన తర్వాత అనూప్ యాదవ్ ను ఇనుప రాడ్ తో కొట్టి చంపేశార. ఆ తర్వాత రోడ్డు పక్కన పడేశాడు. అప్పటికే రక్త స్రావం అధికం కావడంతో రోడ్డుపైనే ప్రాణాలు వదిలాడు. పూనమ్ తన ఇంటికి మంచినీటిని ట్యాంకర్ ద్వారా సరఫరా చేసే కృష్ణకుమార్ తో వివాహేతర సంబంధం పెట్టుకుందని, తర్వాత అది బలపడి ప్రేమగా మారడం, భర్త అడ్డుగా ఉండటంతో అతనిని ప్లాన్ ప్రకారం మట్టుబెట్టారు. పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.

## స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డబ్బు రూ.37వేల 600కోట్లు.. గతేడాదితో పోలిస్తే మూడు రెట్లుపెరిగింది

**హైదరాబాద్ పెన్ పవర్:**స్విస్ బ్యాంకుల్లో భారతీయులు దాచిన నిధులు భారీగా పెరిగాయి. డిపాజిట్లు 3.54 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లకు చేరుకున్నాయి. ఇది 2021 తర్వాత అత్యధికం. పెరుగుదలలో ఎక్కువ భాగం బ్యాంకు మార్గాల ద్వారానే వచ్చాయి. భారతీయ క్లయింట్ల నుండి ప్రత్యక్ష డిపాజిట్లు కూడా స్వల్పంగా పెరిగాయి. 2024లో స్విస్ బ్యాంకుల్లో ఉన్న భారతీయ నిధులు 37వేల600 కోట్లకు పెరిగాయి. ఇది గతేడాది కంటే మూడు రెట్లు ఎక్కువ. ఇది 2021 తర్వాత అత్యధికం. స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డబ్బు 2024లో మూడు రెట్లు పెరిగి 3.5 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లకు చేరుకుందని స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ గురువారం (జూన్19) విడుదల చేసిన వార్షిక డేటా వెల్లడించింది. భారతీయ క్లయింట్ల కస్టమర్ ఖాతాల్లోని డబ్బు ఈయేడాది కేవలం 11 శాతం మాత్రమే పెరిగి 346 మిలియన్ స్విస్ ఫ్రాంక్‌లకు (దాదాపు రూ. 3,675 కోట్లు) చేరుకుంది.. ఇది మొత్తం నిధులలో పదో వంతు అని ప్రకటించింది స్విస్ బ్యాంకు.

## దెబ్బతిన్న బ్లాక్ బాక్స్ లను విదేశాలకు పంపిస్తారంటూ వార్తలు... కేంద్రం స్పందన

- జూన్ 12న అహ్మదాబాద్ లో ఘోర విమాన ప్రమాదం
- 274 మంది దుర్మరణం
- బ్లాక్ బాక్స్ లు స్వాధీనం
- బ్లాక్ బాక్స్ లు దెబ్బతినడంతో కష్టసాధ్యంగా మారిన డేటా విశ్లేషణ!
- వాటిని విదేశాలకు పంపించే అవకాశాలున్నాయంటూ వార్తలు




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల ప్రమాదానికి గురైన ఏఐ171 విమానానికి చెందిన కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సివిఆర్), డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్ (డిఎఫ్‌డిఆర్)లను విశ్లేషణ కోసం విదేశాలకు పంపుతున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గురువారం స్పష్టత ఇచ్చింది. ఈ విషయంలో ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తేల్చి చెప్పింది. "ప్రమాదానికి గురైన ఏఐ171 విమానం నుంచి సేకరించిన సివిఆర్/డిఎఫ్‌డిఆర్‌లను విశ్లేషణ కోసం విదేశాలకు పంపుతున్నట్లు కొన్ని మీడియా సంస్థల్లో వార్తలు వచ్చాయి. అయితే, ఈ ఫ్లైట్ రికార్డర్లను ఎక్కడ డీకోడ్ చేయాలనే దానిపై అన్ని సాంకేతిక, భద్రతాపరమైన అంశాలను క్షుణ్ణంగా అంచనా వేసిన తర్వాతే ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) నిర్ణయం తీసుకుంటుంది," అని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఇలాంటి సున్నితమైన విషయాలపై ఎలాంటి ఊహాగానాలకు తావివ్వవద్దని, దర్యాప్తు ప్రక్రియను నిబద్ధతతో, వృత్తి నైపుణ్యంతో కొనసాగేందుకు సహకరించాలని అన్ని వర్గాలను పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కోరింది.

విమానం కూలిపోయిన మరుసటి రోజు, అంటే జూన్ 13న, ప్రమాద స్థలం నుంచి సివిఆర్, డిఎఫ్‌డిఆర్‌లు కలిగిన ఒక యూనిట్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత జూన్ 16న మరో సెట్‌ను కూడా కనుగొన్నారు. ఈ తరహా విమానాల్లో రెండు బ్లాక్ బాక్స్ సెట్లు ఉంటాయని మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో వివరించింది.

ప్రస్తుతం కొనసాగుతున్న దర్యాప్తు విషయంలో పూర్తి పారదర్శకతకు కట్టుబడి ఉన్నామని, ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ నిర్దేశిత నియమ నిబంధనల ప్రకారమే నడుచుకుంటామని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దర్యాప్తు స్థానిక అధికారులు, ఏజెన్సీల పూర్తి సహకారంతో స్థిరంగా కొనసాగుతోందని పేర్కొంది. ప్రమాద స్థలంలో డాక్యుమెంటేషన్, ఆధారాల సేకరణ వంటి కీలక పనులు పూర్తయ్యాయని, తదుపరి విశ్లేషణ జరుగుతోందని వివరించింది.

# : ఫ్రాన్స్ లో భారత్-ఫ్రెంచ్ సంయుక్త సైనిక విన్యాసాలు ప్రారంభం




**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్, ఫ్రాన్స్ దేశాల మధ్య ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో 'శక్తి' సైనిక విన్యాసాల ఎనిమిదో విడత ఫ్రాన్స్‌లోని క్యాంప్ లార్జాక్‌లో గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ విన్యాసాల్లో ఇరు దేశాల నుంచి 90 మంది సైనికులతో కూడిన బృందాలు పాల్గొంటున్నాయి. భారత బృందంలో జమ్మూకశ్మీర్ రైఫిల్స్‌తో పాటు ఇతర విభాగాల సైనికులుండగా, ఫ్రెంచ్ దళాలకు 13వ ఫారెన్ లీజియన్ హాఫ్-బ్రిగేడ్ ప్రాతినిధ్యం వహిస్తోంది. ఐక్యరాజ్యసమితి చార్టర్ పరిధిలో, ఉప సంప్రదాయ వాతావరణంలో (ప్రత్యేక పరిస్థితుల్లో) సంయుక్త కార్యకలాపాలు చేపట్టడంపై ఈ విడత విన్యాసాల్లో ప్రధానంగా దృష్టి సారించారు. ఇరు దేశాల సైన్యాల మధ్య పరస్పర అవగాహన, కార్యాచరణ సమన్వయం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడం, వ్యూహాత్మక నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం ఈ విన్యాసాల ముఖ్య ఉద్దేశ్యమని ఉన్నతాధికారులు తెలిపారు. భారత బృందానికి కల్నల్ హెచ్.వి. కాలియా నాయకత్వం వహిస్తున్నారు. ప్రారంభోత్సవంలో భారత సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ వీరేశ్ థాపర్, ఫ్రెంచ్ అధికారులు పాల్గొన్నారు. 'శక్తి' విన్యాసాలు భారత్-ఫ్రాన్స్ మధ్య దౌత్య, రక్షణ సంబంధాలను మరింత పటిష్టం చేస్తాయని, ప్రపంచ శాంతి, స్థిరత్వం పట్ల ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటిస్తాయని రక్షణ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేశాయి. ఈ కసరత్తులు ఇరు దేశాల సైనిక దళాల మధ్య లోతైన సహకారాన్ని, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నాయి.